కథా నిలయం
శ్రీకాకుళం

# సానుభూతి - సన్నివేశం

తెల్లవారు ఝామున అయిదూ యిరవై అయింది. రాత్రి ఎక్కిన ప్యాసింజర్ బండి వందలమంది ప్రయాణీకులతో బాటూ నన్నూ యీ పట్నం స్టేషన్‌లో దిగవిడిచింది. అంతా క్రొత్తగావుంది. ఈపరాయివూరి పేదవాళ్ళ అబ్బాయి కోసం స్టేషన్‌కెవరూ రాలేదు-రారు. శ్రమపడి దింపిన ట్రంకు పెట్టెను ఓమూలకు జేర్చి ఓ స్తంభానికి ఆనుకుని సిగరెట్ వూదేస్తూ ఆలోచించసాగాను.

బహుశా ఈమాదిరి అనుభవాలు చాలా తక్కువనుకుంటాను. రాత్రి జరిగిన విశేషాలన్నీ ఒక వరుసన పరికిస్తే అనుభవాలే అన్నీ. క్రొత్తక్రొత్తవి; వింతవింతవి. అపరిచితయైన స్త్రీతో అరగంటసేపు అన్యోన్య సంభాషణ. మీసాలరాయుడి ప్రతాపం! అటూయిటూ రెండు లంబోదర విగ్రహాలుచేరి దుర్బలుడనైన నన్ను నిద్రమత్తు ఆనందంలో నొక్కినొక్కి చంపటం; ఈ బాధపడలేక నిల్చున్నాను. ఎంతకీ పెట్టె ఖాళీగాదు. రాను రాను యిరుకౌతుందితప్ప. అందులోనూ ఆ దారుణ రంగస్థలంలో ఏమాత్రం వీలు చిక్కినా ముందుకువంగో వెనక్కివాలో ప్రక్కలకు జారగిలబడో అవకాశాన్ని పూర్తిగా వినియో

గించుకుంటూ తూగే యీ వింతమనుష్యుల్ని చూస్తే చిరాకు, మరీ జుగప్స కలుగుతోంది. అందుకే రాత్రంతా నిద్రలేదు. నిద్రలేకపోతే మానె,ముప్పాతిక వంతు కాలమూ, దూరమూ కూడా నిల్చోవటమే అయింది. చివరకు "లావొక్కింతయు లేదు...." అన్నస్థితికి వచ్చేసరికి ప్రక్కనున్న పెద్దమీసాల పుణ్యాత్ముడు జాలితల్చాడు. వొంటికాలిమీద కాసేపు కూర్చోనిచ్చాడు. పైగా ఆలోచన్లు.

ఈ ఆలోచనల్లోనే మనుషుల్ని ఎన్నిరకాలుగా విభజించాలో నిర్ణయించుకున్నాను; యీ హక్కు నాస్వంతం అయినట్లు.చాలా కొత్తకోణంలో విభజన సాగించినందుకు గర్వించానుకూడా మనసులో. అబద్ధాన్ని నిజంగా చెప్పేవాళ్లు కొంతమంది; నిజాన్ని అబద్ధాలుగా చెప్పే వాళ్ళు మరి కొంతమంది - వీళ్ళ గురించి నాకు ఎక్కువ పట్టింపులేదు. శ్రోతలవిషయమే ఎక్కువగా పట్టించుకున్నాను. నిజం చెప్పినా అబద్ధంగా భావించుకునే వాళ్లు; అబద్ధంచెప్పినా నిజంగా వూహించుకునేవాళ్లు. వీళ్ళలో మళ్ళీరకాలు: విని ఊరుకునేవాళ్ళు కొంతమంది;విని సానుభూతి చూపించేవాళ్లు కొంతమంది. తమ సానుభూతిని పదిమందికీ ప్రదర్శించే వాళ్లు కొంతమంది. ఈ మూడో రకంలో మళ్ళీ రెండురకాల ప్రకృతులు:నిజమైనసానుభూతి; అబద్ధసానుభూతి. నిజమైనసానుభూతిపరులనుతిరిగి మరో రెండునిధాలుగావిభజించవచ్చు:ఎదుటివాడు-అంటేవక్తచెప్పే మాటలబట్టి అప్పటికప్పుడు సానుభూతి కలిగించుకున్నవాడు, స్వభావసిద్ధంగా ఆ అనుభూతి పొందినవాడు. ఇలా తుది నిర్ణయానికొచ్చాను.

ఈ నిర్ణయాలతోనే నాకు తెల్లారింది.

సిగిరెట్ కాలవటం పూర్తిఅయింది. ఇంకా ఇలా కాలాన్ని వృథాచేయడం భావ్యమనిపించలేదు నాకు. వ్యవహారం నడిపించాలని కూలీని కేకేశాను. పెట్టెవాడిభుజంమీద పెట్టాక ప్లాటుఫారందాటి బయటికి వచ్చాను.

....   ....   ....

ఈ వూళ్లో నాకు ఒకళ్లయిల్లే తెలుసు. నేను దిగేదికూడా ఆ యింట్లోనే. అతిప్రయత్నంమీద అది కనుక్కున్నాను. టాంగా లోంచి గుమ్మం ముందు దిగుతూండేసరికి ఎనిమిదేళ్ళ కుర్రకుంక యిందాకటినుంచీ ఏడ్దూరం చూస్తూ నిల్చున్నవాడల్లా "బామ్మా" అంటూ లోపలకు పరుగెత్తాడు.

బండివాడుపెట్టెను లోపలకు జేరవేస్తూంటే లోపల్నుంచిబయటకి వస్తూన్న ఆడవాళ్ళను చూస్తూంటే సిగ్గుతో నాకు చచ్చిన చావయింది. అప్పుడే ఆవిడ పలకరించేస్తోంది.

"ఏమోయ్, సిగ్గుపడతావేం అలా వెళ్ళికొడుకులాగా....నువ్వీయివాళే వస్తావని అనుకోలేదు. లేకపోతే మా వాడ్ని పంపించేవాడినే స్టేషనుకు."

ఇదీ పెద్ద అబద్ధం అని నాకు తెలుసు. మెల్లగా నవ్వి టాంగా వాలాకు డబ్బులిచ్చే నెపంతో బయటకు వచ్చాను. అంతా సాయిబు మేళం. ముప్పావులా "కల్దార్" తీసుకునికూడా గొణుక్కుంటూ పోయాడు. అప్పటికిబాగా తెల్లవారింది. వెనుదిరిగేసరికి పదహారేళ్ళ పిల్ల ముగ్గుపెట్టడానికి వస్తున్నదల్లా, సిగ్గుపడి ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ గోడవార తప్పుకుంది.

కుర్చీలోకి వచ్చి కూర్చున్నాను. తలవంచుకుని.

యధాలాపంగా ఆవిడ కుశలప్రశ్నలు అడుగుతోంది. ఒకటి రెండుసార్లు పిల్లలు వొచ్చి తొంగిచూసి పోతున్నారు. పనిపిల్ల వయ్యారంగా వొంగుని ముగ్గులు పెట్టుతూ అప్పుడప్పుడూ తలఎత్తి చూసీచూడనట్టూ చూపులు విదిలించి తిరిగి తల వంచుకు తన పని చేసుకుపోతోంది. లోపల కాఫీగిన్నెల చప్పుడు వినిపిస్తోంది. ప్రక్కగదిలో పద్దెనిమిదేళ్ళ పెద్దబ్బాయీ, యింకా ఒక చిన్నపిల్లా బద్ధకంతో తెగ దొర్లేస్తున్నారు. ఈవిడ నాతో మాట్లాడుతూనే మధ్యమధ్యవాళ్ళవి మందలించి పారే స్తోంది. యిదిగో యిదీ వరసా అంటో.

ఇదిఇలా వుండగా సరిగా కళ్లు కనబడని బామ్మగారుమీదకు వచ్చి ప్రేమతో భుజాలు నిమిరుతూ "నీళ్లు నాన్నా, మొహం కడుక్కో" అంది.

ఈ యింటికి రావడం యిది క్రొత్త. ఎలా చావను యీ గొడవల్లో? ముఖప్రక్షాళనం చేసుకుందామని లేచాను. తిరిగి వచ్చేసరికి అప్పుడే వేన్నీళ్ళస్నానంముగించి వచ్చిన ఆవిడగారి భర్తకూడా అక్కడే ఆసీనుడై వున్నాడు; పలకరించాడు.
కుశల ప్రశ్నలు వేశాడు.
సమాధానాలు చెప్పాను.

ఆవిడవచ్చి యిద్దరికీ కాఫీ బల్లమీదపెట్టి వెళ్లిపోయింది. ఓ ప్రక్క చూపు చూశాను. గాజుగ్లాసుల్లో ఆముదంలాంటి కషాయం పొగలు చిమ్ముతోంది. దీన్నే తాగాలి. రంగుచూస్తేనే రుచి తెలు స్తోంది. ఎట్లా భరించటం? పెదిమకదపాలంటే పరాయి చోటు. అందులో యిప్పుడే వచ్చాను. ఇంకా అలవాటుపడలేదు. చేసేది ఏమీలేదు కాబట్టి అందిపుచ్చుకుని సంహారం గావిస్తున్నాను. ఆవిడగారి భర్త ఏమేమిటో చెప్పుకుపోతున్నాడు; కాని నాదృష్టికి అదంతా వాపోవటంలాగే కనబడుతోంది.

ఇలా యీ యిరకాటం ఎంతసేపు అనుభవించాలో అని దిగులు పడుతున్నాను. కాని భగవంతుడు కరుణామయుడు. ఆవిడగారి భర్త "అర్జంటుపని వుంది" అంటూ లేచి బట్టలువేసుకుంటు న్నాడు.

సరే ఆ పూటకు నా సామాన్లు ఓపంథాలో అమర్చుకోవటం జరిగి పోయింది. మంచిమంచమే ఒకటి ప్రసాదించారు.

పదింటికి స్నానంముగించి బట్టలు వేసుకుని బయటకు బయల్దే రాను; అలా చూసి వద్దామని. ఆమెభర్త అప్పుడే ఆఫీసుకు వెళ్లి పోయాడు. లోపల గిన్నెలచప్పుడు చేస్తోందావిడ. ముసలమ్మ గారు కనపడలేదు.

చెప్పే బయల్దేరాను; వొంటరిగా.

బహుశా నాదుస్తుల్లో ఏదో లోపంపుండివుండాలి. ఎగాదిగా మనుషులు చూసేస్తున్నారు. ఎందుకు బయల్దేరానా అనిపించింది. సిగ్గుతో చచ్చినచావు అయిపోతోంది. కాని తప్పదు. ఒక అవ శిష్టం వుందికదా. ఆవిడగారి తాలూకు అబ్బాయిలూ అమ్మా యిలూ ఎవరూ చూడరని నమ్మకం చిక్కాక, ధైర్యంచిక్క బట్టి, ప్రక్కనున్న ప్రహరీగోడ నీడనుచేరి, సిగరెట్టు అంటించి గబగబా ఊదేస్తున్నాను.

లేకపోతే "మింగ మెతుకులేదు. మీసాలకు....పొరపాటు.... నోటికి"....అంటారని నాభయం.

చాలాత్వరగానే నాపర్యటనముగించుకుని, ఎవరో ప్రక్కవాడితో ఏదో చెప్పి మోటుగా పకపకమని నవ్వేస్తున్నా లెక్కచెయ్యా కుండా యింటికి చేరుకున్నాను.

ఎందుకో ఆవిడ సీరియస్‌గావుంది.

కారణం తెలియలేదు. అరవకుండా భోజనం ముగించుకుని ముందు గదిలోకి వచ్చి కుర్చీలో కూలబడ్డాక వెనక నీరసంతో కూడిన అడుగులచప్పుడు వినిపించింది. తల వెనక్కి త్రిప్పి చూసాను. ముసలమ్మగారు వస్తోంది.

"ఏం నాయనా ఎక్కడికి కెళ్ళావ్?" గుసగుస లాడుతోంది. నాకు విషయం బోధపడలేదు.

"ఏం?" అంటున్నాను.

"దానివిషయం నీకు తెలీదు నాన్నా. పొట్టిబండ. గయ్యాళి. ఈ యింట్లో...." అప్పటికప్పుడే ఆమె నీళ్ళకుండ దింపుతోంది. "ఈ యింట్లో ఒహ దాసీదానిలా బతుకుతున్నాను నాన్నా. నికృష్టం, నికృష్టం. నీకుతెలీదు. ఇంకా చిన్నవాడివి. దొరలా బయటకి షికారికెడితే వడ్డించటానికెవరు ఎదురుచూస్తూ కూచుంటారని గిజగిజలాడి చస్తోంది."

సంగ్రహంగా అర్థమయింది.

"అదంతే నాన్నా. దాని నోరు ఎప్పుడూ వాగుతూనే వుంటుంది. లెక్కపెట్టమాక బాబూ. నువ్విక్కడ వుండేది పదిరోజులే. అదేమన్నా కష్టపెట్టుకోకుండా వెళ్ళిపోతే మనమర్యాదదక్కించుకున్నట్లవుతుంది"

పాత్రలు అర్థమవుతున్నాయి. అయితే 'కోడలమ్మగారి అత్తగారు' నాపక్ష మన్నమాట. కొంతవరకూ అదృష్టవంతుడ్నే అనుకున్నాను.

"వాడున్నాడే ఆయెదవ..........దానిచేతిలో కీలుబొమ్మ."

ఇంతకీ ఆవిడ ఇంట్లోనేవుంది. ఎక్కడ వింటుందోనని భయంగా వుంది. అప్పటికీ ముసలమ్మగారు అటూ ఇటూ చూస్తూ గుసగుసలాడుతూ తగు జాగ్రత్త తీసుకుంటూనే వుంది.

అంతలో గుమ్మంబయట అడుగులచప్పుడు వినిపించేసరికి, ఉలుక్కుపడి అక్కడనుంచి వెళ్ళిపోతూ "ఈ ఊళ్లో దొంగ లెక్కువ. అందుకని చెప్పాను. తలుపులు ఎప్పుడూ తీసివుంచకు నాయనా" అంది. అసాధ్యురాలే!

ఈ ఇంట్లో వాతావరణం ఏమిటోగావుంది. రేపటినుంచి కాలేజీ గది వెతుక్కోవాలి. దొరికేదాకా యీ విచిత్రవాసం తప్పదు. చిన్నపిల్లలు స్కూలుకి వెళ్ళిపోయారు. పెద్దవాడు కాలేజీకి వెళ్ళాడు. ముసలమ్మగారు పెరటివైపు వసారాలో, నిండా ముసుగువేసుకుని నిద్రపోయింది. నేను అక్కడ చదికలబడి అల్మారాలో దొరికిన పాతపత్రిక తిరగ వేస్తున్నాను. కొంత సేపటికి ఆవిడభోజనం ముగించుకునివచ్చి బాతాకానీ వేసింది. చాలాసేపు మాట్లాడింది. మరి, బాగానే మాట్లాడింది. ఏవేవో కబుర్లు నిగ్రహంలేని వాడిని కావటంవల్ల అక్కడక్కడ నోరు జారి నన్ను నే బయటపెట్టుకున్నాను. తరువాత పశ్చాత్తాప బడ్డాను.

మొత్తానికి ఆరోజునాకు బాగానే కాలక్షేపం అయింది. రోడ్డు కనిపించేలా కుర్చీవేసుకు కూర్చుంటే, ఫర్లాంగుదూరంలోవున్న ఉమెన్సుకాలేజీకి వెళ్ళివచ్చే ఆడపిల్లలు, రకరకాలవాళ్లు. ఎవరూ చూడకుండా రెండుమూడుసార్లు బయటకుపోయి సిగరెట్లుకాల్చు కున్నాను.

.... .... ....

"ఆవిడ చాలా గయ్యాళి. అత్తగారిని సమస్త బాధలకూ గురి చేస్తోంది.

"ముసలమ్మగారు పాపం మంచివారు. సానుభూతి పరులు."

"ఆవిడగారి భర్త ఆవిడచేతిలో కీలుబొమ్మ. అయినా మంచి వాడే."

ఒకళ్ళు నాకు చెప్పిన విషయాలు అలావుంచి ఈ ఇంటికి వచ్చిన మూడురోజుల్లో నాకు కలిగిన నిశ్చితాభిప్రాయాలు.

తలనొప్పిగా వుండటంవల్ల మధ్యాహ్నం వొంటిగంటకే ఇంటికి వచ్చేశాను. 'నా' మంచంమీద పడుకున్నాను. నిద్రపోవాలని పయత్నం. కాని భగవానుడు కరుణామయుడు కాదు.

"అప్పుడే వచ్చేశావేం నాయనా?" అంటూ ముసలమ్మగారు తయారయ్యారు.

"వంట్లో బాగాలేదు."

"ఏం?"

"తలనెప్పి దంచేస్తోంది" అనిచెప్పాను.

అమ్మలాంటి ఆమె ఆప్యాయంగా వచ్చి ప్రక్కలో కూర్చుని పాలభాగం స్పృశించసాగింది. ఏం చేయను?సిగ్గుపడుతున్నాను.

"ఏమయినా బాధపడుతూంటే చెప్పునాయనా-దాచుకోబోకు."

"తల ఊపాను."

కాని ఆప్యాయతకంటే మనసులో తొలిచివేస్తున్న ఆవేదన గొప్పదన్నమాట. ఆమెగారు ప్రారంభించింది. "ఒకసారి ఏం జరిగిందనుకున్నావు?"

ఇహ తప్పించుకునేందుకు అవకాశంలేదు. "ఆవిడ వింటుం దేమో" అన్నానప్పటికీ ప్రయత్నిస్తూ.

"లేదులే. పెత్తనాని కెళ్లింది."

చచ్చితిని. వినటంతప్ప వేరే శరణ్యంలేదు.బిక్కమొహంవేసి, కళ్ళుమూసుకుని చెవులప్పగించాను.

"నా కాలుమీద పెనం దొర్లింది. ఇంతలావు వాచిపోయింది. డాక్టరుగారు కట్టుకట్టారు. పాలుపోసుకుని అన్నం తినమ్మా అని

చెప్పారు. నా కప్పటికీ భయమే. భయపడుతూనే "పాలుపోసుకు తినమన్నారే డాక్టరుగారు" అని చెప్పాను దానితో. వినలేదు. మజ్జిగ తెచ్చిపోసితింటే తినమంది. లేకపోతేపొమ్మంది" ఆమె గొంతు గాద్గదికమైంది.

"అన్యాయం" అనుకున్నాను మనసులో.

"అది రోజూ రొట్టెలుచేస్తుంది. ఎవ్వరికీ పెట్టదు. అన్నీ మింగుతుంది. తనే, ఒక్కనాడు, ఒక్కపూట 'ఈరొట్టెముక్క తినవమ్మా' అని నన్ను అడిగిన పాపాన పోయిందా? మిగిలిపోతే పని దానికివేసింది. దానిమంప తెగ. అది చిచింద్రీ నాయనా. నాకొంప నిలువునా కూల్చింది."

"ఘోరమే"

"దీనిబాబు వచ్చి ఆనాడు నాకాళ్లు పట్టుకుంటే యీ సంబంధానికి వొప్పుకున్నాను. దమ్మిడీకట్నం తీసుకోలేదు. నాచేతుల్తో నేనే కొరివి పెట్టుకున్నాను, చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏం లాభం నాన్నా! అంతా కర్మ. పూర్వజన్మ సుకృతం."

"పాపం?"

"వీడు! ఈచవటపీనుగ. నా రెక్కలు ముక్కలు చేసుకుని వీడికి చదువు చెప్పించాను. చిన్నప్పుడు బళ్లోకి పోయేవాడుకాదు. వాళ్ళనాన్నలాగే గొడ్లను తోలుకుంటాననేవాడు. ఇంట్లోంచి పారిపోయేవాడు. పొలాలవెంబడి తిరిగేవాడు. ఊహుఁ, నే నొప్పుకోలేదు. వీడు బాగుపడాలి అనుకున్నానంతే. మెడలువిరిచి చదివించాను. రక్తం.... నారక్తమయ్యా. వోడ్చిపెట్టాను. ప్రయోజకుణ్ని చేశాను. ఇప్పుడు నాలుగొందలు సంపాయిస్తున్నాడు. వీడికి విశ్వాసమేమైనా వుందీ? సిగ్గుందా? దొంగచచ్చినోడు.

ఎందుకు వీడి బతుకు? పెళ్ళాం బంగారమైందీ. కని, కష్టపడి పెంచిన తల్లి విషమైందీ? చెప్పలేడూ? "మాఅమ్మచేత పని చేయించబోకని చెప్పలేడూ?మా అమ్మకు అన్నంలోపాలుపొయ్యమని చెప్పలేడూ; రొట్టెముక్కలు పెట్టమని అనలేడూ? తూ. ఛండాలుడు. ఈచర్య ఏమయినా బాగుందీ, మాట్లాడ వేమయ్యా?"

ఇందాకటినుంచి కళ్ళుమూసుకునే, మనసులోనే సానుభూతి ప్రదర్శిస్తూ ఊరుకున్నాను. కళ్లుతెరచి, "నిజమే" అన్నాను.

ముసలమ్మగారు కష్టజీవి. తనగోడంతా నాముందు వెళ్ళబోసుకుంది. ఎందుకు? నా దగ్గరనుంచి సానుభూతిని ఆశించిందా? తెలియదు నాకు. కాని నా హృదయమంతా ఆ అనుభూతితో యిదివరకే నిండిపోయింది. చిన్నవాడిని కావటంవల్లా సిగ్గుపడేవాడిని కావటంవల్లా బయటకు ప్రదర్శించలేకపోవచ్చు.
కాని జీవితంలో దెబ్బతింటూన్న ముసలమ్మగారివంటి వ్యక్తులే నిజమైన సానుభూతిని పొందగలరు; ఇవ్వగలరు. కష్టాన్ని, దాస్యాన్ని అర్థంచేసుకున్న హృదయాలు. ఈ హృదయాల్లో కాఠిన్యానికి,అనవసర నిందలకూ అవకాశంలేదు. ప్రయత్నరహితమైన ఆమెగారి కన్నీళ్ళే దీనికిసాక్షి కాకూడదా?
ఆరాత్రి ఆవిడ భోజనాలప్పుడు అంది "పెళ్ళి చేసుకుంటావుటోయి."

ఎందుకందో నాకు తెలియదు. "నేనా? అని తెల్లబోయాను.

"నువ్వే" అని నవ్వింది.

ప్రక్కనున్న ఆమెభర్తఏమీ మాట్లాడకుండా అన్నం కలుపుతున్నాడు.

నాకు కొంటెతనం వచ్చింది. "ఎవరినేమిటి?"

"అసలు చేసుకుంటావా?"

"పిల్లనచ్చితే."

"బాగానే వుంటుంది."

"నాకు బావుండొద్దూ."

"నువ్వూ చూశావు."

"ఎవరు?"

కొంచెం తటపటాయించి,ఓసారి భర్తముఖంలోకి ఓరగా చూసి "సాయంత్రం నాతో రాలా? ఆ అమ్మాయే" అంది.

"బి. ఏ. చదువుతోంది" అని మళ్ళీ తనే అంది.

"ఇరవై ఒకటి వయస్సు."

నాకంటే ఒక ఏడుపెద్ద. వారేవ్వా!

"ఏం?"

"చేసుకుంటాను."

"ఛా, హాస్యం ఆడబోక?"

"నిజం. అయిదువ్వేలు కట్నం యిచ్చేటట్లయితే చేసుకుంటాను?"

"కట్నమా?" ముఖం చూడలేదు. తెల్లబోయినట్లుంది.

"ఏం?" నేను తీసుకోకూడదా?"

"అదికాదు" అంటూ వెళ్ళిపోయింది లోపలికి. మళ్ళీ ఆవిషయం ఎత్తలేదు.

కాని ఆ మరునాడు ముసలమ్మగారన్న మాటలు ఆశ్చర్యాన్ని గొల్పాయి. "దానిబుద్ధి చూశావా నాయనా?"

ప్రశ్నార్థకంగా చూస్తున్నాను.

"అంతా తమాషా జరిగిందిలే. పచ్చడి రుబ్బుకునే నెపంతో ఆ పిల్లతల్లి నిన్న వొచ్చింది. నిన్ను చూసింది. కోడల్ని రాయ బారం పంపించింది" అని కొంచం ఆగి "నువ్వు తగ్గట్లు జవాబు చెప్పావుగా. ఇహ చూడు. పొద్దున్న వాళ్ళిద్దరూ కలిసి నీ మీద పాడీలు. కోడలు నీ మీద ఎన్నెన్ని చెప్పిందని? రామరామ కిటికీలో కూచుని వచ్చేపోయే ఆడవాళ్లను చూస్తుంటావుట. నీ బుద్ధి మంచిదికాదుట. నేను నీకు చెబుతానని తెలీదు. దాని ముదనష్టపు బుద్ధి నీకింకా అర్థంకాదు నాన్నా.

వళ్ళు మండింది. అసలు నిన్న అంత మాట్లాడకుండా వుండ వల్సింది. నిజమే. ఆ సాహసం ఎలా వచ్చిందో నాకు బోధపడ లేదు. ఇవాళ ఉదయం టిఫిన్ దగ్గర ఆవరించిన సిగ్గు, నిన్న భోజనాలదగ్గర ఎలా దూరమైంది? ఆశ్చర్యపడాల్సిన విషయమే. సాధ్యమైనంత చప్పున యీ యిల్లు వొదలాలని నిశ్చయించు కున్నాను.

.... .... ....

ఒకరోజు, ఒకానొక విచిత్రమైన సంఘటన జరిగింది. ఈ సంఘటన జరిగివుండకపోయినట్లయితే యింతవరకూ యిదంతా వ్రాయవలసిన అవసరంవుండేది కాదు.

మధ్యాహ్నం మూడుగంటలయింది. ఆదివారం. నేను ఆర్గానిక్ కెమిస్ట్రీ చదువుకుంటున్నాను. పనిమనిషి ఇంతకుముందే ఆ గది వూడ్చి లోపలకు వెళ్లిపోయింది; రెండుమూడు చిరునవ్వులు కూడా విసిరి. తలచుకుంటూంటే నవ్వువస్తోంది నాకు. వాలా

వరణం కొంచం అలవాటయినట్లుంది; ఓ రకం ధీమా ఏర్ప డింది. ఇంతలో ఆవిడగారి పెద్దబ్బాయీ, మరో స్నేహితుడూ లోపలకు దూసుకువచ్చారు. నా మంచంమీద కూర్చున్నారు.

"ఇతను సంగమేశ్వర్రావుగారి మేనల్లుడు. మనయింటికి రెండిళ్ళవతల. నా క్లాసుమేటు" అని పరిచయం చేశాడు.

ఆ అబ్బాయిని చూశాను. నాకు మల్లే సన్నగా, చిన్నగా వున్నాడు. పైపెచ్చు అమాయకంగా వున్నాడు. ఇదివరకు దూరం నుంచి చూశాను, అంతే.

సంగమేశ్వర్రావుగారంటే "ఆపిల్ల" నాన్నగారు.

ఏదో అవీయివీ మాటలాడుతున్నాము. పెద్దబ్బాయి "యిప్పుడే వస్తాను" అని లోపలకు పోయాడు. తిరిగి యిద్దరికీ కాఫీ యిచ్చారు.

ఇంతలో ఆవిడ లోపలనుంచి ఏదో పనిమీద గావును, మేమున్న గదిలోకి వచ్చింది. "ఏమిటోయి సత్యం! అంత పెద్దవాడివి అయిపోయావేమిటి ? అసలు కనబడటం మానేశావు" అన్నదా కొత్త అబ్బాయిని.

"లేదు. చదువుకుంటున్నానమ్మగారూ"

ఆశ్చర్యంగా వాళ్ళ సంభాషణ వింటున్నాను.

"అంతేలే. నువ్వెక్కడ? నీగురించి మీ అత్తయ్య చెబుతూనే వుంది. నువ్వెలా అయినా బాగుపడే యిది కనబడటల్లేదులే. ఈమధ్య తిరుగుడు ఎక్కువయిందిటగా"

"అది కాదండి" కాఫీకప్పు క్రిందపెట్టి మాటలు తడుముకుంటు న్నాడు.

"నాకంతా తెలుసులేవయ్యా. అయినా నీ బుద్ధి ఎవరికి తెలియనిదిలే. జాలితలచి మీ మామయ్య యింట్లో పెట్టుకున్నందుకేనా ఏమిటి? ఈ ఆగడమంతా" అని అక్కడ్నుంచి లోపలకు వెళ్లిపోయింది.

నే నిద్దరి అబ్బాయిలవంక ప్రశ్నాకర్ధంగా చూస్తున్నాను.

"చూడరా. మీ అమ్మ ఎలా అంటుందో" అన్నాడు కొత్త అబ్బాయి.

"అలవాటు పడాలిరా. ఏం చేస్తావు? నీ తప్పేమీ లేదని నాకు తెలుసుకదా" అన్నాడు మా యింటివారి పెద్దబ్బాయి.

అతను తలవొంచుకున్నాడు.

నేను మెల్లగా "ఏమిటీ? మీమీద యీావిడ కింత అధికారం?" అన్నాను.

"అదంతా వుందిలెండి"

"చెప్పండి. ఫరవాలేదు"

"అది కాదండీ" అంటూ అతను తలపైకెత్తాడు. కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయి. కంఠం వొణుకుతోంది. "మా అమ్మా,నాన్నా చిన్నప్పుడే చచ్చిపోయారు. నేనూ, మా చెల్లీ మా మామయ్య యింట్లో వుంటున్నాం. మా అత్తయ్యకు మేమంటే కొంచమైనా యిష్టంలేదు. అడ్డమైన చాకిరీ చేస్తున్నాం. చూడండి. ఇంటర్మీడియట్ చదువుతున్నాం. నేను సమ్మర్ క్రాఫింగ్ వుంచుకోవాలిట"

గుండె ద్రవిస్తోంది నాకు - సానుభూతి తలఎత్తుతోంది.

"ఇలాగేనండి, ఏ పనిచేసినా తిట్లుతప్పవు. మెప్పుకోసం ప్రయ

త్నించటంకూడా ఒక అపరాధం. వాళ్ళమ్మాయి బి. ఏ. చదువు తోంది. నామీద ఎంత అధికారం చెలాయిస్తుందనుకున్నారు? వీళ్ళమ్మకీ, మా అత్తయ్యకీ ఎడతెగని స్నేహం.రోజూ మధ్యాహ్నం చేరి ఏమేమిటో గుసగుసలు. నాగురించి అత్తయ్య తెగ చాడీలు చెబుతుంది. ఈ వీధిలో వాళ్ళందరికీ చెబుతుంది.దాంతో నేను అందరికీ లోకువైపోయాను. అంతా చీదరించు కుంటారు. అంతా అధికారం చలాయిస్తారు. పరాయివాళ్ళని విదిలించినా మాయింట్లో నామీద యుద్ధం. అంచేత ఎవరెన్నిమాటలన్నా పడి నోరుమూసుకోవటానికే అలవాటు చేసుకున్నా. వీళ్ల చేసినపనులు....నామీద దొంగతనాలు కట్టారు. పోగరుబోతు నన్నారు...."

"ఊరుకోరా యిప్పుడవన్నీ ఎందుకు?" అంటున్నాడు పెద్ద బ్బాయి.

"అదికాదండీ" అంటూ ఇంకా అతను ఏదో అనబోతూంటే పరిస్థితి విషమిస్తుందని కాబోలు, "పదపద" అని బలవంతంగా బయటకు లాక్కుపోయాడు.

నే నాలోచిస్తూ కూర్చున్నాను. ఎంత చోద్యం! ఇంత విష పూరితమైనదా యీ లోకం? దయ, జాలి అనేవి ఎవరికోతప్ప లేవా? నాకు చప్పున ముసలమ్మగారు జ్ఞాపకంవచ్చింది. కష్టాలు జీర్ణించుకున్న వ్యక్తి. ఈ నిర్భాగ్యుడికి ఆమెగారి హృదయంలో వున్నతస్థానం లభించివుంటుంది.

"పోయాడా?"

ఉలుక్కిపడ్డాను. ముసలమ్మగారి గొంతు. ప్రక్కకు తిరిగాను. "ఎవరు?"

"ఆ పచ్చినోడు. సత్యం"

"ఏమిటి?" తుళ్ళాను.

"వాడు వొట్టి దొంగవెధవ. చెడుతిరుగుళ్ళు తిరుగుతాడు. పోకిరీ. ఆడపిల్లలమీద రాళ్లు రువ్వుతాడు. రౌడీ. వాడిమాటలు నమ్మకు నాన్నా. నిన్నేం డబ్బులు అడగలా? వాడితో మాట్లాడకు. స్నేహం చెయ్యకు"

ఇంకా ఏమిటో చెప్పుకుపోతోంది. తలతిరిగింది నాకు. వెనక్కి జారగిలబడ్డాను. ఆమెగారి హృదయంలో యింత కాఠిన్యం ... ఎలా?

సానుభూతులు, అనుభూతులు, వ్యక్తులు, విభేదాలు, సన్నివేశాలు, వైషమ్యాలు....తల తిరిగిపోతోంది. ఇన్ని భావపరంపరలకు నాలో చోటు వుండటంలేదే. ఇంకా వ్రాసేది ఎట్లా? అసంభవం. నిట్టూర్చాను.